# పునర్నవం

నడమ క్రిందికి జారుతున్న నారాయణవనం సరిగంచు పంచను ఎడమ చేతితో సవరించుకుంటూ, వ్రేళ్ళమధ్య సిగరెట్టు కాలుతున్న కుడిచేతితో వల్లెవాటుగా వేసుకున్న పెద్దాపురం కండువాను సర్దుకుంటూ, లోపలినుండి వీధి మెట్ల పైకివచ్చి నిల్చున్నాడు భానుమూర్తి.

వీధిపొడుగునా తలుపులు ఓరవాకిలిగా తెరచుకున్నాయి. కిటికీల కవాటాలు అరవిచ్చుకున్నాయి. తెరచుకున్న తలుపులకు, కిటికీలకు అవతల సంజీవిగారింటికి వచ్చిన అబ్బాయి చక్కని వాడౌనో కాదో తేల్చుకోగోరే వుబలాటం చిందులు ద్రొక్కుతోంది——! అరరే, అబ్బాయి బాగానేవున్నాడే! కోలముఖం, ఎత్తుగా పైకెక్కి నున్నగా క్రిందికి దిగిన క్రాపింగు, కళ్ళ జోడు. మనిషి పొడగరి. కాదంటే ముదిరిన బెండకాయేమోనని అనుమానింపడానికి కాస్త అవకాశంవున్నమాట నిజమే! కానీ యింత వయసొచ్చి గూడా వరహీన మనిపించే పెళ్ళికొడుకు లెంతమంది లేరు! పరవాలేదు, ఈ సంబంధం కుదిరితే ప్రభావతి అదృష్టవంతురాలే!

నేపథ్యంలో చెలరేగుతున్న ఈ సంభ్రమాన్ని పసిగట్టగానే భానుమూర్తి త్రుళ్ళిపడి గబగబా మెట్లుదిగి వీధిలోకి వచ్చేశాడు. ఈ పెళ్ళిచూపుల తతంగంలో ప్రదర్శనాగారానికి వచ్చిన వింత వస్తువులా పరిణమించిన తన వ్యక్తిత్వం, అతడికేమంత ఆహ్లాదకరంగా లేదు!

భానుమూర్తి ఒకటి రెండు క్షణాలు తటపటాయించాడు. ఇప్పుడు తనేవైపుగా వెళ్ళాలి? ఉత్తరంగా వెళ్తే ఈ దుర్గమ్మగుడి వీధి—ఫ్యాక్టరీ పొగ గొట్టాల బుసబుసలు, గ్రామఫోను రికార్డుల గగ్గోలు, రకరకాల పాద రక్షల విన్యాసంతో అదొక ట్యాప్ డ్యాన్సుకు మల్లే పేవ్‌మెంట్లపైన కదలిపోయే అసంఖ్యాకులైన స్త్రీ పురుషులు, వాళ్ళకేకలూ కేరింతలూ హాసాలూ, విలాసాలూ-ఈ మహాసంరంభంతో నిండి నిబిడీకృతమైన నగర గర్భంలోకి తీసుకెళ్తుంది. ఇదేవీధిలో ఒకటి రెండు ఫర్లాంగులు దక్షిణంగా వెళ్తే యిండ్లు పలచబడిపోతాయి. ఆ తరువాత పచ్చగా పంటపొలాలు, నిరంతరమూ నీళ్ళు కనిపించే ఓ చిన్న యేరు. ఏటికటువైపున తంగేడుచెట్ల బీడు. ఆ బీడు దాటుకోగానే రైల్వేస్టేషను....

మధ్యాహ్నంనుంచీ యింతకు మునుపెన్నడూ ముఖ మెరుకలేనివారి మర్యాదలతోనూ, మన్ననలతోనూ ముఖం మొత్తిన భానుమూర్తి ఇంచుక స్వేచ్ఛగా గాలిపీల్చుకోడానికి వీలుగా దక్షిణంగానే బయల్దేరాడు. సంజ కెంజాయల కొలువుకూటంలోనుంచి దినమణి లోకంపైకి అందాలనూ ఆనందాలనూ వెదజల్లుతున్నాడు. ప్రకృతి వసంతంలో మునిగిలేచిన క్రొత్త పెళ్ళికూతురిలావుంది. ప్రియుడి దగ్గరనుంచీ సందేశాన్ని మోసితెచ్చిన దూతికలా చల్లటిగాలి పైరుపచ్చలతో గుసగుసలాడుతోంది. మీగాటిబంటి వరకూ వస్తున్న ఏటినీటిలో చిరుచేపలు ఎదురీత కొడ్తున్నాయి....

ఏటిలో దిగుతూ చేతికి తీసుకున్న చెప్పుల్ని మళ్ళీ తొడుక్కుంటూ భానుమూర్తి ముందుకు చూచాడు. తలపైన గడ్డిమోపుతో ఓ పల్లెపడుచు ఎదురుగా వస్తోంది. కట్టుకున్నది పాతచీర. వేసుకున్నది మాసికల జాకెట్టు. కొప్పులో తంగేడు పువ్వులు. ఐనా కళ్ళల్లో ఆణిముత్యాల గనులు! సత్యవతి అన్న బెస్తవారిపిల్ల శంతనరాజు మనసును దోచుకున్నది యిలాటి స్వచ్ఛమూ, సహజమూ అయిన సౌందర్యం చేతనేకాబోలు!....భానుమూర్తి లోలోపలే నవ్వుకున్నాడు. శంతనుడి విషయం తనకు తెలియదు గానీ, తన మనసుమాత్రం తనదగ్గరే భద్రంగా వుంది!

ఈసారి భానుమూర్తి తలపులన్నీ 'ఆ అమ్మాయి' పైకి ప్రసరించాయి. ప్రభావతట పేరు! సార్థక నామధేయం. ఆ ఇంట్లో ఆమె ప్రభ అట్టహాసంగా వెలిగిపోతోంది. అమ్మాయి అందమైందేగానీ, ఆ అందం తామరాకుమీద నీటిబొట్టులా మరీ అంత తత్తళించి పోకుండా ఉంటే బాగుండేది! తనాయింట్లో అడుగుపెట్టి ఇంకా ఓ పూటైనా గడపలేదు. ఆమె కెన్ని చీరలున్నాయో తను లీలగా వూహించుకో గలిగాడు. అయ్యో పాపం! ఆమె మాత్రం ఏంచేస్తుంది? అంతా తల్లిగారి తరిబీదు! ఆ తల్లి, ఆమె పేరు కాంతమ్మ—కాంతమ్మమాటలు అయస్కాంతాలు! ఆమె కింకా నలుగు రైదుగురు బిడ్డలున్నట్టున్నారు. ఒక్కొక్క మగబిడ్డా ఒక గడుగ్గాయ! ఒక్కొక్క ఆడబిడ్డా ఒక సిసింద్రీ! అక్కయ్య మెడలో మూడుముళ్ళు పడాలేగానీ ఆ తర్వాత వీళ్ళు బావగారిని ఒలుచుక తినేసేట్టున్నారు. ఈ కుటుంబాని కల్లా నోటిలో నాలుకలేనిది ఒక్కరికి మాత్రమే! అతడు గృహస్థు సంజీవరావు!

'ఏమండీ' అన్న పిలుపును ఆఫీసరుగారి కాలింగ్‌బెల్ మ్రోతకన్నా మిన్నగా పరిగణించే సంజీవరావును తలచుకుంటూ జాలిపడ్డాడు భానుమూర్తి.

రైల్వేస్టేషను సందడిగా ఉంది. మూడవ తరగతి ప్రయాణీకుల వెయిటింగు రూముగా పేర్కొనబడుతున్న డబ్బారేకుల షెడ్డులో జనాల రద్దీ చెప్పతరంగాదు. ఎలాగో త్రోవచేసుకుని భానుమూర్తి ప్లాటుఫారం పైకి వచ్చాడు. ఎగుమతి కాబోతున్న మామిడి ముక్కలు, బాతులబుట్టలు, కరివేపాకు మూటలతో క్రిక్కిరిసిపోతున్న వరాండాలోనుంచీ ఏకాంతాన్ని అన్వేషిస్తూ అతడు ముందుకు నడవసాగాడు.

ప్లాటుఫారం చివర భానుమూర్తికో బెంచీ కనిపించింది. సగం మేరకూ ఖాళీగావున్న ఆ బెంచీపైన కూర్చోబోతూ అతడు మిగిలిన సగంలో పడుకున్న మనిషివైపు చూచాడు.ఆ చూచిన క్షణంలో ఎగిరి గంతువేసినంత పని చేశాడు భానుమూర్తి. "శేషగిరీ! ఒరేయ్ శేషగిరీ! మిథిల కాలిపోతోందని తెలిసినా వులక్కుండా పలక్కుండా శ్రద్ధగా పాఠం వింటూ కూర్చున్న

జనకుడివర్రా నాయనా నువ్వు! ఇంత విశాలమైన ప్రపంచముండగా పడుకోవడానికి ఈ రైల్వేస్టేషనే దొరికిందా నీకు! అదేమిట్రాబాబూ, అలా తెల్లబోతావెందుకూ? నేనే!, నీ స్నేహితుణ్ణి భానుమూర్తిని!'' అంటూ అతణ్ణి లేపి కూర్చోబెట్టి గ్రుక్కత్రిప్పుకోడానికి వీల్లేకుండా వుక్కిరి బిక్కిరి చేసేశాడు భానుమూర్తి.

జేబులోనుంచీ బీడీ పైకితీసి అగ్గిపెట్టెకోసం చేయి చాపుతూ "బాగున్నావర్రా భానూ!'' అన్నాడు శేషగిరి.

"ఏదో నేనిలా వున్నానుగానీ ఇదేమిట్రా నాన్నా, నువ్విలా తయారయ్యావు? ఇక్కడికి ఎప్పుడొచ్చావు? ఇప్పుడెక్కడికి వెళ్తున్నావు?ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం ఏమిటి?''-భానుమూర్తి మిత్రుడిపైన ప్రశ్నల వర్షాన్ని కురిపించాడు.

బనీనులేని జుబ్బాలోనుంచీ ఎముకలు బాహాటంగా పైకి కనిపిస్తున్న శేషగిరి, దుబ్బులా పెరిగిన క్రాపింగును రెక్కలు విప్పిన గబ్బిలంలా వదలిపెట్టిన శేషగిరి, పెరిగిన గడ్డంలో ముఖకవళికలు మరుగున పడిపోయిన శేషగిరి అదేపనిగా లోపలికి పీల్చిన పొగను బయటికి వదలి, ఆ పొగ మబ్బుల్లోనుంచి మాట్లాడసాగాడు....

"ఐదారు మాసాలుగా ఈ పట్టణంనుంచి ఓ సాహిత్య మాస పత్రిక వెలువడుతోంది. నీకు తెలియదా భానూ?''

"సాహిత్య మాసపత్రిక! ఈ పట్టణంనుంచి! ఆశ్చర్యంగా ఉందిరా శేషగిరీ! నాకింతవరకూ తెలియదు.''

"ఇప్పుడిక తెలిసి మాత్రం లాభమేముంది?'' అనవరతధూమ సంపర్కంతో నలుపెక్కిపోయిన శేషగిరి పెదవిపైన విషాదగర్భితమైన ఓ శుష్కహాసం ప్రాకింది. "ఎందుకంటావా భానూ! ఆ పత్రిక ఇంక వెలువడదు, సంపుటి ఒకటి. సంచిక ఆరు. అంతలోనే బాలారిష్టం!''

"ఎందుకూ?''

"మార్కెట్టులో ఏవస్తువుకైతే గిరాకీ ఉందో, అలాటి సరుకును

'శారద'పరఫరా చేయలేక పోయింది. పదేళ్ళగా నేను కలలుగన్న శారదరా భానూ. పురిటిలోనే సంధి కొట్టుకపోయింది....''

చెమ్మగిల్లిన కళ్లు మిత్రునికి కనిపించకుండా తలవంచుకుని వేడిగా నిట్టూర్చాడు శేషగిరి.

''ఐతే నువ్వు-మీవూరికి వెళ్ళిపోతున్నావన్నమాట!''

''వెళ్ళక చేసేదేముంది?'' కాసేపాగి నిద్రలోనుంచీ ఉలికిపడి లేచి నట్టు తలపైకెత్తాడు శేషగిరి—''ఒరేయ్ భానూ! నాకో పెళ్ళాముంది. ఇద్దరు బిడ్డలున్నారు. ఇది నేను మర్చిపోవడానికి వీల్లేని యధార్థం. నేను బియ్యే పరీక్ష తప్పానని నీకు తెలుసు. పోయిన పరీక్షను పూర్తిచేసుకోవాలన్న వుద్దేశం నా కెన్నడూ కలిగిందిగాదు. ఇప్పుడు చదివి కృతార్థుణ్ణి కాగలనన్న విశ్వాసమూ లేదు. నాకో వుద్యోగం కావాలి. మేం నలుగురమూ పస్తులు పడకుండా ఏపూట కాపూట గడుపకపోగల ఉద్యోగ మేదైనాసరే చేయ డానికి నేను సిద్ధంగా వున్నాను. ఉద్యోగానికి నా యితర వ్యాసంగాలు అడ్డు దగులవచ్చునని అనుకోవద్దు. ఆశలూ, ఆశయాలూ, ఆదర్శాలూ అన్నీ మృగతృష్ణలవెంట పరుగెత్తి కళ్ళుమూసుకుని ఇసుక మైదానంలో పరుగిడితే తిరిగి తిరిగీ బయల్దేరినచోటుకే రావలిసి వుంటుందన్న పరమ సత్యాన్ని గుర్తించాను. నిజం చెబుతున్నాను భానూ, ఇక పొట్టపోసుకోడ మొకటే నా జీవిత ధ్యేయం!''

భానుమూర్తి ఆశ్చర్యంతో బిర్రబిగుసుకపోయాడు. వీడేనా శేషగిరి! శేషగిరేనా యిలా మాట్లాడుతున్నది! తెల్లబోయి నోట మాటరాక అలాగే ఒకటి రెండు నిమిషాలపాటు శేషగిరిని చూస్తూ వుండిపోయాడు భాను మూర్తి.

''అదేమిట్రా భానూ, అలా బెల్లం కొట్టినరాయిలా కూచున్నావు'' అని శేషగిరే మళ్ళీ పలకరించాడు.

''పునాది గట్టిగాలేని సౌధం ఒకటి కూలిపోయిందని ఆ తరువాత ఇళ్ళుకట్టడమే మానేస్తారా శేషగిరీ! నువ్వు నిజం చెబుతున్నానన్నావు. నే

నంతకన్నా నిజం చెబుతున్నాను. నీ రచనల్ని చదివి వెక్కి-వెక్కి ఏడ్చిన వాళ్ళని నేను ప్రత్యక్షంగా చూచాను. ఒకరిసంగ తెందుకు,నామట్టుకు నాకు నీ కథ చదివి పడుకున్న రాత్రి నిద్రపట్టేది గాదు....''

"అదేరా బాబూ, నేను నెత్తిన నోరుపెట్టుకుని మొత్తుకుంటున్న మాటా అదే! నా రచన ఆరాటాన్ని కలిగించిందేగానీ ఆవేదనను ఉపశమింప జేయలేధు. నా కథ దుఃఖానికి దోహదం చేసిందేగానీ కన్నీటిని తుడిచి ఓదార్చలేదు. ఈ పదేళ్లుగా నేను ఊహల్లో బ్రతికి అశాంతితో చివికి పోయాను. పల్లెటూళ్ళో నా పెళ్ళాం బిడ్డలు నా ప్రాణానికి ఉసూరుమంటూ దారిద్ర్యంతో అలమటించి పోయారు. నా కథల్లోని పాత్రలూ ఏడ్చాయి. వాటిని చదివిన పాఠకలోకమూ ఏడ్చింది. విశ్వానికి శ్రేయస్సును సంధించేదే కావ్యమన్నారు. నా మూలంగా మానవజాతికి కాస్త పీడ మాత్రం కలిగి వుంటుంది. తోడి మానవుల్ని యిలా బాధిస్తూ ఇదే సాహిత్యసేవ కాబోలు ననుకుని నేను పొరబడ్డాను. ఈ ఆత్మ విమర్శ నాకెంతో హృదయ దహ్నం గానే ఉంది. ఐనా ఏంచేయమంటావురా భానూ, తెలియమిచేత నేను పొర బాట్లు చేసి వుండవచ్చు. కానీ నిజాన్ని మాత్రం ఎన్నడూ దాచుకోలేదు....''

వాదించి శేషగిరిని ఒప్పించడం తన చేతనయ్యేపని గాదని భాను మూర్తికి తెలుసు. కానీ ఏవేవో భావాలు మాత్రం అతడి మనసులో గింగుర్లు తిరుగుతున్నాయి——శేషగిరి కథల్లో ప్రత్యక్షమయ్యే వాళ్ళందరూ సామాన్య మానవులు. మరి సామాన్యమానవులందరూ బ్రతుకు బరువు మోయలేక,అలాగని దించుకోనూలేక,వేసటతో గాసిల్లి ఆయాసంతో శోషిల్లి నిట్టూర్పుతో నింగి వంకకు చూచేవాళ్ళేగనుక అతడి కథలు పాఠకుల హృద యాలను కదిలించడంలో ఆశ్చర్యమేమీలేదు. మానవత్వాన్ని పునీతం చేసేది కరుణరసం. అందుకే నవకవనానికి కదిలేదీ, కదిలించేదీ కావాలన్నాడు కవి. శేషగిరి చేసినపని సరిగ్గా యిదే! కానీ యిప్పుడీ హితబోధ శేషగిరి బుర్రకెక్కే సూచనలు లేవు. ఇతడు తెట్టతేరకు నిరాశాకూపంలో దూకే శాడు. పోనీ, ఎలాటి దృఢచిత్తుడైనా ఒక్కొక్కప్పుడు యిలా క్రుంగి

పోవడం సంభవమేనని తను కేలూత యిచ్చి పైకి లాక్కో బోతే ససేమిరా రానంటే రానని మొండికేస్తున్నాడు. ఇదే విచిత్రం!

"ఐతే నువ్వికమీదట కథలు వ్రాయవన్నమాట?" జాలిగా ప్రశ్నించాడు భానుమూర్తి.

శేషగిరి తలగడగావుంచుకున్న చేతిసంచిలోనుంచీ ఓ కాగితాలచుట్టను తీసి భానుమూర్తివైపు విసిరాడు—"బహుశా యిదే నా చివరి కథ. ఏమీ వ్రాయగూడదన్న నిర్ధారణకు వచ్చిగూడా దీన్ని వ్రాయకుండా వుండలేక పోయాను. తెల్లవారుజామున మూడు గంటలనుంచీ ప్రారంభించి, ఉదయం ఎనిమిదివరకూ వ్రాశాను. ఇంతచేసీ కథ పూర్తికాలేదు. అసలు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో వ్రాసిన కథగాదు. తీసుకెళ్ళు భానూ! నా కథను కనీసం ఒక్క పాఠకుడైనా చదవకపోతే నాకు బాధగా వుంటుంది...."

రెక్కమాను దగ్గరినుంచీ ఇంజను కూత ఒకటి రెండునిమిషాలపాటు కర్ణకఠోరంగా వినిపించింది. పెట్టెలతో, పరుపులతో ప్రయాణీకులు ప్లాటుఫారంపైన మూగిపోయారు. భానుమూర్తి ఆలోచనలో పడ్డాడు. మిత్రుడిలో శిథిలమైపోతున్న ఆత్మవిశ్వాసాన్ని ప్రోదిచేయాలన్న కోరిక భానుమూర్తి కెంతైనా వుంది. కానీ స్టేషనులో నిలిచి రైలు మళ్ళీ బయల్దేరడానికి ఇంక ఎంతో వ్యవధిలేదు. చివరకు భానుమూర్తి ఓ నిర్ణయానికి వచ్చాడు. ఎలాటి రుగ్మతనైనా పటాపంచలు చేయగల ప్రభావం కాలానికి వుంది. ఆ కాలమే శేషగిరిని చక్కదిద్దుతుంది.

"పోనీ, ఈ కథను నన్నే పూర్తిచేయమంటావా శేషగిరీ? నేను నీలాంటి కథకుణ్ణి గాకపోవచ్చు. కానీ ఎంతచెడ్డా పాతరోగిని కదా!" మెల్లగా నవ్వుతూ అడిగాడు భానుమూర్తి.

భుగభుగమని పొగలు చిమ్ముకుంటూ వచ్చి రైలు స్టేషనులో ఆగింది. సంచిని చేతికితీసుకుని లేచినిల్చుంటూ అన్నాడు శేషగిరి—

"చేయిదాటి పోయిందిగనుక ఆ కథను నువ్వేమైనా చేసుకోవచ్చు. కానీ నే నొకందుకు నిన్ను తీవ్రంగా హెచ్చరిస్తున్నాను. నా కథ ఆకాశం

నుంచి ఊడిపడిందిగాదు. వెన్నలాంటి మనసుతోనూ, అమృతకలశం లాంటి హృదయంతోనూ నాకు చేరువైన ఒకానొకరి దుఃఖజీవితం ఆధా రంగా నే నీ కథ వ్రాశాను. ఇప్పుడీ కథ ఎక్కడ ఆగిపోతుందో నీకు తెలి యదు. పరిస్థితులు తోడేళ్ళలా తరుముతున్నాయి. ఆ ప్రాణి ఓపినంతవరకూ పరుగు తీసింది. కానీ హఠాత్తుగా ఒకచోట ఆగిపోవలసి వచ్చింది, ఆ ఆగి పోయినచోటు ఒక కొండపేటు. ఎదుట అగాథం. వెనుక తోడేళ్ళు. ఒక అడుగు ముందుకు వేయడం జరిగితే ఏమౌతుంది? అచ్చంగా మరణం గాకపోవచ్చు. పోనీ మరణంలాంటి పతనమనుకో, నాకేమీ అభ్యంతరం లేదు. ఆ పతనం మానవుణ్ణిగా నేను ఊహించరానిది, కథకుణ్ణిగా నేను వ్రాయడానికి సాహసించలేనిది!"

శేషగిరి కంపార్టుమెంటులో ప్రవేశించి తావుచేసుకుని కిటికీ దగ్గర కూర్చున్నాడు.

భానుమూర్తి స్నేహితుడికి వీడ్కోలు చెప్పడంకోసం మాటలిఒ వెదుక్కుంటూ రైలుపెట్టెకు చేరువగా ప్లాట్‌ఫారంపైన నిల్చున్నాడు.

"అన్నట్టు నా గొడవే నాదిరా భానూ! నువ్వీవూరు ఎందు కొచ్చావో అడిగాను కాను. ఏమిటి విశేషం?" అన్నాడు శేషగిరి.

తనకింకా పెళ్ళి కాలేదన్న విషయం శేషగిరికి తెలియనివ్వడం అంత మంచిపని కాదనుకున్నాడు భానుమూర్తి. ఇంత ఆలస్యానికి కారణమేమి టని అతడు నిలదీసి అడుగుతాడు, అదేం గ్రహచారమో గానీ తనకే సంబంధమూ నచ్చలేదని తను వాస్తవాన్ని బయట పెట్టవలసి వుంటుంది. 'చూచిన ప్రతి సంబంధమూ నచ్చకపోవడ మేమిటి? కాదులే! అలా నచ్చక పోవడానికి వెనుక ఏదో కథ వుంటుంది' అంటాడు శేషగిరి. తను అవివా హితుడుగా వుండిపోవడంపట్ల చాలామంది ఆ అభిప్రాయాన్నే ప్రకటించారు. నిజానికి కథా లేదు—తన తలకాయా లేదు!

కాసేపు నీళ్ళనమలి కడకు శుభ్రంగా ఓ అబద్ధాన్ని చెప్పేశాడు భానుమూర్తి.

"ఆఁ-విశేషమేముంది శేషగిరీ! గ్రామంలో ప్రొద్దుపోక ఇలా ఒకసారి వూళ్ళు తిరిగివద్దామని బయల్దేరాను."

స్టేషనులో దీపాలు వెలిగాయి. గార్డు విజిలువూది పచ్చదీపం పైకెత్తాడు. రైలు కదిలింది. "వస్తానురా భానూ! నా మాట మరచిపోవు గదూ" అన్నాడు శేషగిరి.

★ ★ ★

బరువెక్కిన హృదయంతో భానుమూర్తి తిరుగుదారి పట్టాడు. తలవని తలంపుగా ప్లాటుఫారంపైన తారసిల్లి అంతలో దూరమైపోయిన బాల్యమిత్రుడి పరిదీన విగ్రహం అతడి మనఃఫలకం పైన హత్తుకుపోయింది. ఈనాడే గాదు—ఏనాడు తను శేషగిరిని కలుసుకున్నా అది యాదృచ్ఛిక సంఘటనే! పదేళ్ళ మునుపు కాలేజీనుంచి విడిపోయిన తర్వాత మూడేళ్ళ వరకూ వాడి అజాపజా తెలిసిందిగాదు. మండువేసంగిలో ఒకనాడు మధ్యాహ్నం బూడిదదుమ్ము సెగలు చిమ్ముతున్న ఓ బస్ స్టాండులో వాడు కనిపించాడు. తను బస్సుదిగేసరికి వాడెక్కిన బస్సు కదలి అప్పుడే నాలుగు బారలు సాగిపోయింది. బస్సువెంట పరుగిడుతూ నాలుగుమాటలు మాట్లాడ్డానికే గగనమైపోయింది. ఆ తరువాత ఒకసారి అతడు తను మొదటి ఆటనుంచీ వస్తూండగా రెండో ఆటకు వెళ్తూ థియేటరు ప్రాంగణంలో ఎదురయ్యాడు. అలాగే మరొకప్పుడు ఒక సభలోనూ, ఇంకొకప్పుడు బజారులోనూ అతడికీ తనకూ హఠాత్సమాగమం సంఘటిల్లింది. అలాగని శేషగిరిపట్ల తనలో ఆత్మీయత తరిగిపోలేదు సరిగదా, పైపెచ్చు పెంపొందుతూ వచ్చింది. అందుకు కారణం వాడి కథలు. అడపాదడపా అవి తన హృదయాన్ని పలకరించుకొని వెళ్ళేవి. చదువుతుంటే శేషగిరి తన ఎట్టయెదుట కూర్చుని వాడి ఆవేదనల్ని, అనుభూతుల్ని ఉపన్యసిస్తున్నట్టు తోచేది. చదువుతూ శేషగిరి ఎక్కడున్నా, ఏమి చేస్తున్నా తన లక్ష్యంవైపు అచంచలమైన దీక్షతో నడచిపోగలుగు తున్నాడని భావించడానికి వీలుండేది. శేషగిరిని గురించి అంతకన్నా తెలుసుకోవలసిన కుశలవార్త మరేముంది గనుక! ఇకపైన అలాంటి అవకాశంగూడా లేదేమో!

పరధ్యానంగా మెట్లెక్కి వసారాదాటి హాల్లో ప్రవేశించాడు భాను మూర్తి. ఇల్లంతా ఇంచుమించు నిర్జనంగా వున్నట్టు తోచింది. లేదంటే ఎర్రగా, బొద్దుగా నీలిరంగు పాంటుపైన పచ్చటి బుష్‌కోటు తొడుక్కున్న ఓ హ్రస్వకాయుడు టేబిలు దగ్గర నిల్చుని తోలుసంచిలో సీసాలు పేర్చు కుంటూ ప్రత్యక్షమయ్యాడు.

అడుగుల సవ్వడి వినిపించగానే అతడు వెనుదిరిగి భానుమూర్తివైపు చూచాడు. వెనుతిరగగానే మెడలోని లాంఛనాన్ని బట్టి భానుమూర్తి అతడు డాక్టరుగారని ఊహింప గలిగాడు.

వాటి సహజ స్వభావమే అంతేనేమో! డాక్టరుగారి కళ్ళు మిణుగురు పుర్వుల్లా మెరిసి పోతున్నాయి. ముఖం కందగడ్డలా బూరటిల్లి పోయింది. ఎందుకోగానీ ఆయనలో కోపం పేట్రేగి పోతోంది.

"బల్లగుద్ది చెబుతానయ్యా కావలిస్తే! మనుషులన్న తర్వాత కాస్త వివేకం వుండొద్దూ! మధ్యాహ్నా మెప్పుడో బాణలిజారి వేడినూనెపడి చేతి వేళ్ళు కమిలిపోతే—ఈ పట్టణంలో డాక్టర్లనబడే వాళ్ళు వీధివీధికీ ఒకళ్ళు న్నారుగదా, వాళ్ళ కెవరికైనా కబురు పెట్టగూడదూ? ఆ మాత్రం ఓపరికం లేక తీరామారా దొంగలు వెళ్ళిపోయిన ఆరునెలలకు మొరిగేవాళ్ళుంటారా ఎక్కడైనా!"

అలాటి వాళ్ళుండబట్టే మీరు నిశ్చింతగా బ్రతుకగలుగుతున్నారని అందామనిపించింది భానుమూర్తికి! అతడు తనవూహకు తనే వెరగొంది పోయాడు. ఈ వక్రబుద్ధి తనదిగాదు. ఏమిటోమరి! ఈ పరిసరాల్లోనే ఏదో ఒక వక్రగతి అంతర్లీనమైవుండి తనబుద్ధిని కలచివేస్తున్నట్టుంది. అదేమిటో ఎంతగా ఆలోచించినా అంతు చిక్కడంలేదు!

"డా... డాక్టరుగారూ! మీ.... మ్మీరు దయచేసి వెళ్ళండి." గదిలో నుంచీ సుడిగాలిలావచ్చి అడ్డుతగిలాడు సంజీవరావు. డాక్టరుగారిని సాగ నంపి "రా నాయనా! నీ కోసమే చూస్తున్నా. షికారు కెళ్లొచ్చావేమో! కాళ్లు కడుక్కోవాలి గదూ!" అంటూ భానుమూర్తిని వెంటబెట్టుకుని పెరట్లోకి దారి తీశాడు.

పెరట్లో అడుగు పెట్టగానే ఒక్కపెట్టునవచ్చి చెవి గూబలకు తాకిన కలకలాన్ని విని భానుమూర్తి తలపైకెత్తాడు. తల్లీ కూతుళ్ళు చిన్న పిల్లలతోసహా డాబాపైన నిండు పేరోలగం తీర్చినట్టున్నారు. బహుశా పుర వినోదాన్ని తిలకిస్తున్నారేమో! కాకపోతే కౌముదీ విహారం కావచ్చు. అలా గనుకోడానికి యింకా చంద్రోదయం కాకపోవడ మొక్కటే అభ్యంతరం!

భానుమూర్తి ముఖం కడుక్కుని కండువాతో తుడుచుకోబోయాడు.

"ఇదిగో, వుండు బాబూ! టవలు తెస్తాను" అంటూ సంజీవరావు హుటాహుటిగా లోపలికి పరుగుదీశాడు.

సంజీవరావు వెనువెంటనే లోపలికి వచ్చాడు భానుమూర్తి. నడవలో చీకటి చిందులాడుతోంది. అందుకుతోడు అక్కడున్న ద్వారం గూడా చిన్నది. భానుమూర్తి తనెంత పొడుగ్గా వున్నాడో అంత పొడుగ్గానే ఈవలికి రావడానికి ప్రయత్నించడంతో ద్వారబంధం తగిలి నుదుట బొప్పిగట్టింది. తల దిమ్మెక్కిపోయి, భానుమూర్తి ఎక్కడ నిల్చున్నాడో అక్కడే స్తంభీకృతుడై పోయాడు.....ఏ వాస్తు శాస్త్రాన్ని పాటించి కట్టారోగానీ ఈ యింటితరహా అంతా అదోరకంలా వుంది. ఎత్తయిన అరుగులు, విశాలమైన వసారా, వసారా కిరువైపులా గదులు. ఆ తరవాత అందంగా హాలు. అంతవరకూ బాగానేవుంది. ఆ పైన ఒక గుహను తొలచడానికి ప్రయత్నం జరిగింది. వెలుగు పారాడదు. గాలి నడయాడదు. ఆదమరిచి తలపైకెత్తుకుని నడిస్తే, యిదిగో యిలాగే పేడెగిరి పోతుంది!

నాలుగైదుక్షణాలలాగే నిల్చుండిపోయినతర్వాత భానుమూర్తి అడుగు ముందుకు వేయబోయాడు. కానీ అతడు మళ్ళీ అక్కడే ఆగిపోవలసి వచ్చింది. ఈ సారి అతడు ఆగడానికి కారణం నేలమట్టానికి రెండడుగుల ఎత్తులో వున్న గవాక్షంలోనుంచి కనిపించిన వంటగది దృశ్యం.

పాత్రలు, డబ్బాలు, గోనెసంచులు. వంటచెరకులాంటి వివిధవస్తు సమూహంతో ఆ గది ఓ పాతసామానుల దుకాణంలా వుంది, కానీ భానుమూర్తి దృష్టిని అకర్షించినవి ఈ వస్తువులు గావు. నిప్పులు కణకణలాడు

తున్న పొయ్యి. ఉవ్వెత్తున పైకి లేస్తున్న పొగ. పొయ్యి ఎదుట మోకాలి పైన తల అనించుకుని ముంజేతివరకూ బొబ్బలెగిరి పోయివున్న కుడిచేతిని ఎడమచేతిలోని విసనగర్రతో విసరుకుంటూ పొగవైపు శూన్యదృక్కులు నిగుడిస్తున్న ఓ అమ్మాయి!

ఇంతకుమునుపే ద్వారబంధం తాకిడికి అర్ద్రమైపోయివున్న భాను మూర్తి కళ్లు ఆ క్షణాన కన్నీటి కొలనులై పోయాయి.

"అదేమిటి నాయనా! అక్కడే నిల్చుండిపోయావు" అన్న సంజీవ రావు పలకరింపుతో మళ్ళీ ఈ లోకంలోపడి భానుమూర్తి చరచరా హాల్లోకి వెళ్ళి కుర్చీలో కూలబడిపోయాడు. కూర్చున్న భానుమూర్తి బుర్రలో అలల హోరు ధ్వనిస్తోంది—అయ్యో, తను పొరబాటు చేశాడు, పెళ్ళి చూపుల కంటూవచ్చి రాత్రిపూటగూడా తామసించడం ఎంత అనుచితం! ఎవరెంత చెప్పినా వినకుండా తను సాయంత్రమే తిరిగి వెళ్ళిపోయివుంటే యిలాటి హృదయవిదారకమైన దృశ్యం తన కళ్ళపడి వుండేదిగాదు. ఈ సంబంధం పట్ల తన యిష్టాయిష్టాల ప్రసక్తిని అలావుంచి, ఈ అమ్మాయిగారి సంగీతాన్ని వినితీరవలసిందేనని తన నుదుట వ్రాసిపెట్టినట్టుంది. ప్రక్కవాద్యం లేకుండా పెదవి కదపడానికా అమ్మాయికి యిష్టంలేకపోయింది!

భోజనాలవేళకు సరిగ్గావచ్చాడు మ్యూజిక్ టీచరు. భోజనాలైన తర్వాత తీరిగ్గా కానిద్దామని సలహాయిచ్చింది కాంతమ్మగారు. కానీ యిక్కడ భానుమూర్తి సమయస్ఫూర్తి కాస్తా చురుగ్గా పనిచేసింది. "అబ్బే, నాకిప్పుడే ఆకలి కావడం లేదండీ!" అంటూ అతడు అర్థాంతర న్యాసంగాఅప్పటి కప్పుడే గానసుధను గ్రోలడానికి సంసిద్ధత ప్రకటించాడు.

నిలుపులేకుండా ముప్పావుగంటసేపు కొనసాగింది సంగీతం. గురువు గారి వీణపైన శిష్యురాలి గాత్రం పలుతెరంగుల పరవళ్లు త్రొక్కింది. అర్ధ నిమీలిత నేత్రాలతో శిలాకృతిలా కూర్చున్న భానుమూర్తి సంగీతంలోని సారస్యాన్ని చవిచూస్తున్నట్టే గోచరించాడు. అంతేమరి! మనిషి శరీరాన్నీ, అందులోనూ ముఖ్యంగా ముఖభంగిమల్ని అదుపులో పెట్టుకోగలిగితే

చాలు-అంతరంగంలోని ఆలోచనలు, ఆందోళనలూ బాహ్యనేత్రాలకు గోచరించేవిగావు.

కాంతమ్మగారు స్వయంగా వడ్డించగా భోజనాలు గూడా ముగిశాయి.

వసారాలోని కుడివైపు గదిలో పరుపువేసి, కిటికీ తెరిచి మంచినీళ్ళు తెచ్చిపెట్టి ఆఫీసు తనిఖీకివచ్చిన పైఅధికారికి చేసినట్టు సకలోపచారాలు నెరపినతర్వాత సంజీవరావు గూడా సెలవు తీసుకున్నాడు.

అతడలా వెళ్ళగానే భానుమూర్తి తలుపు వేసుకున్నాడు. కప్పు నుంచీ వ్రేలాడుతున్న విద్యుద్దీపంక్రింద కూర్చున్నాడు. జేబులోని కాగితాలు పైకి తీశాడు.

శేషగిరి వ్రాసిన చివరికథ....

★ ★ ★

'సుభాషిణి అని పేరు పెట్టినప్పుడు ఆ పిల్ల మూగదని ఎవ్వరికి తెలుసు?' అంటూ రవీంద్రకవి ఓ కథను ప్రారంభిస్తారు. అవును మరి! విధి విధానంలోని వైచిత్ర్యమంతా ఆ తెలియకపోవడంలోనే వుంది.

చనిపోయి స్వర్గలోకంలో వుంది ఆ తల్లి. తన బిడ్డకు ముద్దుగా లక్ష్మి అని పేరుపెట్టుకుంది. ఊగేటి ఉయ్యేల్లో నవ్వేటి ఆ బిడ్డను చూచిన వాళ్ళు పుట్టుకకు తగిన పేరు అని సంబరపడేవుంటారు. కానీ ఏం లాభం? అ చిన్నారి అడిగివచ్చిన రాత చిన్నది. ఆమె కయిదో యేడు జరుగుతుండగా తల్లిపోయింది. మగవాడి పారిభాషిక నిఘంటువులో పెళ్ళాం పోవడానికి అర్థం మళ్ళీ పెళ్ళికొడుకు కావడమేగదా! లక్ష్మి కారోయేట మారుతల్లి కాపు రానికి వచ్చింది.

ఇదంతా నేను విని తెలుసుకున్న కథ. లక్ష్మి యిప్పుడు ఆరేళ్ళ బాలపాపగాదు, మూర్తీభవించిన నిండు జవ్వని! నాలుగేళ్ళకు మును పెప్పుడో ఆమెకు పెళ్ళి జరిగింది. అత్తగారింటికి వెళ్ళింది. పాదాలకు వేసు కున్న పారాణి మాసిపోకమునుపే భర్తను గోల్పోయి తిరిగి వచ్చింది. హత భాగ్యగాలు లక్ష్మికి అచ్చటకు ముచ్చటకు నోచుకోని అంధకార జీవితం మాత్రమే మిగిలిపోయింది.

ఆరునెలల క్రిందట ఓరోజు సాయంత్రం గదికోసం అన్వేషిస్తూ పట్టణంలో గ్రుమ్మరుతున్నాను. గుమ్మంలో కనిపించాడు గృహమేధి. 'వీధి వైపు గది అద్దెకిస్తారటండీ?' అంటూ వినయంగా ప్రశ్నించాను. స్విచ్ నొక్కిన మరబొమ్మలా అతడు లోపలికి నిష్క్రమించాడు. ఆ తరువాత కొద్దిక్షణాలకు గృహిణి వెలికి రావడమూ, పదిహేను నిమిషాల మౌఖిక పరీక్షలో నేను పాస్‌మార్కులు తెచ్చుకోవడంతో తృప్తిపడి ఆమె నాకు అద్దెకివ్వడానికి సమ్మతించడమూ, ఆ రోజు రాత్రే నేను నా చేతిసంచితో సహా ఆ గదిలో ప్రవేశించడమూ జరిగాయి.

ఆ గృహమేధి చిత్రమైన మనిషి. లక్ష్మణుడు వనవాసానికి వెళ్తూ తన నిద్రను ఊర్మిళకు దత్తంచేసి వెళ్ళాడన్నది పురాణ గాథ. సమస్తవాగ్ వ్యవహారాలనూ భార్యపరం చేసి యిక్కడ భర్త మూకీభావాన్ని స్వీకరించడం ప్రత్యక్ష గాథ! ఇంచుక మెచ్చికోలుకు, కాస్తంత అభిమానానికీ పాత్రంగాకపోవడం చేతనే గావచ్చు, అతని మనస్తత్వం మంచి చెడ్డలకూ, సుఖదుఃఖాలకూ అతీతంగా కరడుకట్టుకుపోయింది. అతడు పదును వానకు పదరడు. ప్రక్కవీథిలో అగ్నిప్రమాదం, ఎదురింట్లో అంటు జాడ్యంలాంటి వార్తలు అతణ్ణి చలింపజేయలేవు. ముమ్మూర్తులా అతడి లాంటి రాతిబొమ్మ నొకదాన్ని తయారుచేసి అరుగుపైన కూర్చోబెడితే అది చేయలేని పనులు కొన్నిమాత్రమే వున్నాయి. ఒకటి, అది ఆఫీసుకు వెళ్ళదు. రెండు, నెల పుట్టగానే జీతం రాళ్ళు తెచ్చి యింట్లో సమర్పించదు. మూడు, ఎవరేమి చెప్పినా బసవెద్దులా వూఁకొట్టదు.

ఇక గృహిణి విషయమంటేనా, గృహస్వామితో ఎందునా పోలిక లేని లక్షణా లామెవి! ఆమె మొదటమొదట తీరిక చిక్కినప్పుడల్లా (తీరిక చిక్కడం నాకు! ఆమె కెప్పుడూ అదొక సమస్య కానేకాదు) తన పుట్టింటిని గురించి చెబుతుండేది. ఆ పుట్టింట్లోనట, ఓ కుర్రాడు తినగా మిగిలి పార వేసే అన్నం సామాన్యకుటుంబంలో నలుగురైదుగురికి సరిపోతుందట! ఆమెగారి బాబాయి ఒకతను బిడ్డలు లేకపోవడంచేత వరుసగా మూడు

పెళ్ళిళ్ళు చేసుకుని, వాళ్ళు ఈయనగారిని పున్నామనరకంనుంచీ ఈవలికి లాగడం అటుంచి, యింట్లో ఒక సరిక్రొత్త నరకాన్ని సృష్టించడానికి పూనుకోవడం వల్ల ఒకే ప్లానుతో వేర్వేరుగా మూడు మేడలు కట్టించేశాడట!....

ఆమె ఏ విషయాన్ని గురించయినా నిరాఘాటంగా మాట్లాడగలదు. కానీ సంస్మరణమాత్రాన ఆమెకు ఉత్తేజాన్ని కలిగించే విషయాల్లో పుట్టింటి ఘనత తర్వాత చెప్పుకోతగ్గది తన సంతానాన్ని గురించిన ప్రసక్తి!

'నువ్వు వీణ్ణి చూచావా గిరీ!' అంటూ ఆమె పరుగునా లోపలికి వెళ్ళి ఓ ఫోటో తీసుకొచ్చేస్తుంది. 'చెప్పుకో చూద్దాం! వీణ్ణి మా రమాకాంతు డనుకుంటున్నావుగదూ! కాదు. వీడు మా సుధాకరుడు. ఇద్దరూ కవలపిల్లల్లాగుంటారు. చూస్తున్నావుగా, ముష్టియుద్ధానికి రెడీ! వీళ్ళనేం చూశావులే, నువ్వు చిన్నప్పుడు మా బేబీని చూచివుండాలి. అచ్చంగా జాతివాళ్ళ పిల్లలా వుండేది, ఉండుండు, నువు మా ఉషాదేవి కృష్ణుడివేషం చూడలేదుగదూ..'' ఒకటి రెండు నిమిషాల్లో నాకు మరొక ఫోటో ప్రత్యక్షం కాబోతున్నదన్న మాట! తల్లి తన బిడ్డలను గురించి పెరిమెలు చెప్పుకోవడంలో అసహజమేమీలేదు. కానీ దేనికైనా ఓ హద్దుమాత్రం వుంటుంది. ఈ ప్రసంగాన్ని వింటుంటే నాకు వీళ్ళు నవమాసాలు మోసి కన్న బిడ్డలా, లేక 'ఉష్ మంత్రకాళీ' అన్న చిన్న చిటకాతో యిలా మానవ రూపాలు ధరించేశారా అన్న సందేహం కలుగుతుండేది.

మళ్ళీ ఆమెకు మిగిలిన బిడ్డలందరూ ఒక ఎత్తు, తన పెద్దకూతురు మాత్రమే ఒక ఎత్తు. ఆ పదహారేళ్ళ అమ్మాయికి యింట్లో రెండేళ్ళ చంటిపాపకుమల్లే ముదిగారం జరుగుతుంది. స్కూలునుంచి యింటికి రాగానే అమ్మాయికి జరిగే ఉపచారాలనుబట్టి చూస్తే, ఆమె కోనదాటికోసకు వెళ్ళి నిలువెత్తు కట్టెలమోపు తెచ్చి పెరటిలో పడవేసివుండవచ్చుననిపిస్తుంది. తల్లి దృష్టిలో ఆమె దిరిసెనపువ్వు, తాకితే కందిపోతుంది!

కాకిపిల్ల కాకికి ముద్దు అంటారు. కావచ్చు; పైగా తన కుమార్తె కాకిపిల్లేంకాదు. అందాల రామచిలుకే! కానీ ఈ తల్లి తన బిడ్డ కాదన్న ఒకే

ఒక్క కారణాన్ని పురస్కరించుకుని దిక్కులేని లక్ష్మి తలపైన యింటెడు చాకిరీ రుద్దుతుందా? జ్వరంతో మూల్గుతున్నప్పటికీ ఆ నిర్భాగ్యురాలు లేచిపోయి రాజేసేవరకూ కాఫీకి దోవలేకపోతుందా? పొగలో వుండీవుండి జేవురించిన ముఖం, పాత్రలు తోమీతోమీ మొద్దుబారిన చేతులు, నీళ్ల చేదీ చేదీ బొబ్బలుపడిన వేళ్ళు—యింత యాతనపడినా ఒరిగేదేమిటి? నెల రోజులు వరుసగా చూచాను. కట్టుకున్న పాతచీర ఒకటి తప్పితే లక్ష్మికి మరొకటి లేదు.

గొంతెత్తి ఏడవడానికైనా తీరికలేని బ్రతుకు లక్ష్మిది. ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు సైతం కనిపించేవిగావు. బహుశా అవెప్పుడో యింకిపోయి వుంటాయి.

నిజానికి లక్ష్మి యింతకంటే విపరీత విపత్కర పరిస్థితులమధ్య తపించిపోతున్న విషయం నాకు ఆ తరువాత చాలా రోజులకుగానీ తెలిసిందిగాదు.

ఓరోజు మధ్యాహ్నం పదకొండుగంటలప్పుడు ఒక పుస్తకం కావలసి వచ్చి ఆఫీసునుంచీ తిరిగివచ్చాను. వచ్చిన తొందరలో తాళంచెవిని ఆఫీసు టేబిలుపైన వుంచి మరచిపోయానన్న సంగతి జేబులో చేయివేసి చూచుకొన్న తర్వాత తెలిసింది. మారు తాళాలతో ప్రయత్నిద్దామని కాంతమ్మ గారికోసం యింటిలోపలికి వెళ్ళాను. నేలపైన పడిపోయి విలవిలలాడుతోంది లక్ష్మి.

“ఏమిటి లక్ష్మీ! ఏం జరిగింది?” అన్నాను.

“వంటచెరకులోనుంచి తేలుకుట్టింది మేష్టారూ! ఎర్రతేలు!!” చేతిని విదిలించుకుంటూ రోదించింది లక్ష్మి.

చేతికి దొరికిన త్రాటితో సలుపు పైకెక్కకుండా మోచేతిక్రింద ఓ కట్టు కట్టాను. “నాకు తెలిసిన ప్రథమ చికిత్స యిదే లక్ష్మీ! నీరుల్లి రసం వేయడం, అగ్గిపుల్లమందు కాచడంలాంటి చిల్లరవైద్యాలు చాలా ఉన్నాయి. ఇంతకూ మీ పిన్నిగారింట్లో లేరేమిటి!” అన్నాను.

లక్ష్మి హృదయంలో సుళ్ళు తిరుగుతున్న శాశ్వతమైన బాధ తేలు కుట్టిన తాత్కాలిక బాధ మూలంగా లావాద్రవంలా పెల్లుకింది.

"ఆమె ఇంట్లో ఎందుకుంటుంది మేష్టరుగారూ! ఆఫీసునించీ నాన్నగారూ, స్కూలునుంచీ పిల్లలు, పొరుగిళ్ళనుంచీ పిన్నిగారు... అందరూ ఒకేసారిగా వచ్చేస్తారు. ఆపాటికి నేను పీటలూ, విస్తర్లు వేసి సిద్ధంగా వుండాలి. అప్పుడైనా తప్పులు పట్టి దెప్పకపోతే అదే పదివేలు! లోకంలో ఎందరో చనిపోతూంటారు. నాలాంటి దానికి రాదు చావు. మీరు గాబట్టి నా ఏడుపును యింతసేపైనా విన్నారు; నాలుగేళ్ళయింది. నేను నా సొద మరొకరితో చెప్పుకుని........"

"పోనీలే లక్ష్మీ! కష్టాలు కలకాల ముంటాయా?" చదివిన మాటలతో ఓదార్చబోయాను.

"అదేమిటి మేష్టరుగారూ! కష్టాలు నన్నొకప్పుడు వదిలిపెట్టలేదు. ఇకపైన వదిలిపెడ్తాయన్న ఆశగూడా లేదు. హైస్కూల్లోనైతే ఫీసు కట్టవలసి వుంటుందని నాన్నగారు నన్ను జీతంలేని బడిలో చేర్చారు. మూడేళ్ళు చదివి నేను మైతుస్టాండర్డులో ఫెయిలై కూర్చున్నాను. లేకుంటే హయ్యర్ గ్రేడు పంతులమ్మగానైనా బ్రతక గలిగి వుండేదాన్ని...."

లక్ష్మిని ఆవరించివున్న అంధకారంలో నా కప్పుడొక ఆశాజ్యోతి కనిపించినట్టయింది. "పోనీ, యిప్పుడైనా ప్రత్యేకంగా కట్టి పాస్ చేయగూడదా లక్ష్మీ!" అన్నాను.

"నేనా! ఇప్పుడా! సాధ్యమౌతుందా మేష్టరుగారూ?" తటాలున లేచి నిల్చుంది లక్ష్మి. ఉన్మాదంలాంటి ఆశ ఆ ప్రశ్నలో ధ్వనించింది.

మృత్యువక్త్రంలో పడిపోతున్నప్పుడుగూడా ప్రాణిని వెన్నాడే ఆశ ఎంత గొప్పది! మరణాన్నే ఆవలికి నెట్టగల ఆశలో, లక్ష్మి చేతి సలుపును విస్మరించడంలో ఆశ్చర్యమేముంది?

కానీ అంతలో లక్ష్మి ముఖాన విచార మేఘాలలుముకున్నాయి. "నేను పరీక్షలో పాసు కాగలనా మేష్టరుగారూ! ఇప్పటికే లెక్కలు, చరిత్రా అలాటివి మరచిపోయాను...."

"నీ కెందుకు లక్ష్మీ! మూడు మాసాల్లో నిన్ను పరీక్షకు సిద్ధంచేసే బాధ్యత నాది" అన్నాను.

లక్ష్మి కళ్ళల్లో ఆనందం మిలమిలలాడింది. "నిజంగానా మేష్టరు గారూ! నిజంగానే చెబుతున్నారా మీరు...." ఆమె కంఠస్వరంలో ఆశా, ఆనందమూ విహ్వలించిపోతున్నాయి.

"నిజం, నిజం" అంటూ భరోసా యిచ్చాను. నా కొక రాజ్యాన్ని జయించినంత సంబరంగా వుంది. ఒక దురదృష్ట జీవిని దుఃఖజలధిలో నుంచీ లాగేయబోతున్నాను. మానవుణ్ణిగా నేను చేయగల మహత్కార్యం దీనికంటే వేరొకటి వుండబోదు.

ఆ ఆనందంలో తాళం విరగ్గొట్టి పుస్తకం తీసుకుని ఆఫీసుకు వెళ్ళి పోయాను.

ఒక్కొక్కప్పుడు వృక్షాన్ని అటునుంచీ నరక్కరావలసి వుంటుంది. ఆ రోజు సాయంత్రం సరాసరి యజమానురాలిదగ్గరే ఈ విషయాన్ని ప్రస్తావించాను. ఆ అమ్మాయి ఎలాగూ కుటుంబానికి భారంగా వుందనీ, ఎలాగైనా ఆమెను వదిలించుకోడం ఉభయత్రా మంచిదనీ, అందుకిదే ఉపాయమనీ కాస్త కపట నాటకంగూడా ఆడవలసి వచ్చింది.

"ఏమిటి! నువ్వు దానికి ట్యూషను చెబుతావన్నమాట!" విస్తుపోతూ అడిగింది గృహిణి. అడుగుతూ ఆమె నా ముఖంలో దేనికోసమో అన్వేషించింది.

"నాకున్న తీరికను ఓ సత్కార్యానికి వినియోగించడంలో తప్పు లేదు గదండీ!" అన్నాను.

"కానీ అదెలా కుదురుతుందనీ! పగటివేళ నీకు ఆఫీసుంటుంది. రాత్రుల్లో భోజనాలు ముగిసే సరికి ఏ తొమ్మిదో పదో అవుతుంది. ఆ ట్యూషను చెప్పడమేదో అ తరువాతనైతే మా అభ్యంతర మేమీలేదు...."

ద్వారంలోనుంచీ తల ఈవలకు చాపి "అలాగే, భోజనాలయ్యాకే చదువుకుంటాను పిన్నీ!" అంది లక్ష్మి.

ఈసారి ఆ యిల్లాలు లక్ష్మి ముఖంలో దేనికోసమో గాలించింది— ఐతే ప్రవాహంలాంటి ఉత్సాహంలో ఎదుటివారి చిత్తవృత్తిని అర్థం చేసుకునే ఓపిక నాకుగానీ, లక్ష్మికిగానీ లేకపోయింది. లేవగానే పరుగందుకునే లేడిలా లక్ష్మి ఆ మరునాటి రాత్రే చదువుకోడానికి సిద్ధమైంది.

తన చదువును పునరుద్ధరించుకోడానికి దేవుడి గదిని ఎన్నుకుంది లక్ష్మి. దేవుడి గది అన్న నేరానికి ఆ గదిలో నాలుగైదు పటాలు బూజులో మునిగి మ్రుగ్గిపోతుండేవి. తన చదువుతోపాటు లక్ష్మి ఆ పటాలను తుడిచి పెట్టి పూజాపునస్కారాలు గూడా ప్రారంభించింది.

పదిరోజులపాటు పాఠాలు ముమ్మరంగా సాగాయి. కానీ రోజులు గడచినకొద్దీ నా ఉత్సాహం చప్పబడిపోసాగింది. లక్ష్మికి నేననుకున్నంత సులభంగా చదువు పట్టుబడే సూచనలులేవు. ఆమె కనేక ప్రాథమికాంశాలే జ్ఞప్తిలో లేవు. ఆరేళ్ళ యిరవై నాలుగు అంటుంది. దేశానికి ఎల్లలుచెబుతూ పడమట బంగాళాఖాతమంటుంది. ఆమెకు తెలిసినంతలో ఆంధ్రరాష్ట్రాని కింకా ముఖ్యనగరం చెన్నపట్టణమే! ఆశ్చర్యమేమిటంటే యిలాంటి బలహీనమైన పునాదిపైన ఆమె బ్రహ్మాండమైన ఆశాసౌధం కట్టుకోగలుగుతున్నది. ఏ కోశానా నిరుత్సాహం కనిపించడంలేదు సరికదా, దినదినానికీ ఆమెలో శ్రద్ధాసక్తులినుమడిస్తున్నాయి. శారీరక బలమంతా వెట్టిచాకిరీలో వినియోగమైపోగా, అనవరత క్లేశాలతో గాయపడిన మనసు కోలుకోలేకపోగా, ఆమె కేవలం తన ఆత్మబలంతోనే ఈ తుది ప్రయత్నం చేస్తున్నట్టు తోచేది. ఫలితమేమైనా ఔగాక, ఈమెకు తోడ్పడడం నా బాధ్యత అనుకునే వాణ్ణి. నిష్కామకర్మ యింత సులభమా అనిపించేది. కానీ ఈ సంతృప్తి గూడా కలకాలం నిలువలేదు. అచిరకాలంలోనే అదొక దారుణ ప్రహారంతో తునాతునకలైపోయింది.

ఉదయం ఎనిమిదిగంటలవేళ. ఆఫీసుకు బయల్దేరబోతుండగా ఆరేళ్ళ సుధాకరం లోపలికి వచ్చాడు. వచ్చినవాడు ఓ క్షణమైనా తటపటాయించకుండా "మేష్టరుగారూ! మా అమ్మ మిమ్మల్ని అడిగి అయిదురూపాయలు తీసుకురమ్మంది" అన్నాడు.

నేను తెల్లబోయాను. అద్దె డబ్బులు నెల మొదటివారంలోనే చెల్లి పోతున్నాయి. పోగా గడచిన పదిహేను రోజుల్లో ఒకసారి పదిరూపాయలు, మరొకసారి అయిదు రూపాయలు చేబదులివ్వడం జరిగింది. మళ్ళీ యింతలోనే మరొక అయిదురూపాయలు కోసం కబురా! పట్టణంలో వుండి నేను చేస్తున్న ఉద్యోగం దొంగనోట్లు అచ్చువేయడం కాదే!

ప్రస్తుతం నాచేత డబ్బులేదని, రేపోమాపో అయితే ఎలాగో సరిపెట్టగలననీచెప్పి కుర్రాణ్ణి వదిలించుకున్నాను. కానీ ఆ సంఘటనను మాత్రం అంతలో మరచిపోలేకపోయాను. ఈ యింట్లో ప్రతి ఒక్కరూ తమ హోదాకు మించిన భోగాల్నే ఆశిస్తున్నారు. పౌడర్లు, స్నోలు, సబ్బులు, సినిమాల్లాంటి విలాసాలకే నెలనెలా యిరవై ముప్పై రూపాయలు కావలసివచ్చేటట్టున్నాయి. జీవన వ్యయం ఏకానికి పెరిగిపోయి, శేరు బియ్యం ఒకటింపావలా కమ్ముతున్న ఈ రోజుల్లో ఈ కుటుంబానికి భోజనపు ఖర్చులకే వంద రూపాయలు సరిపోవు. పైగా బంధువులో, స్నేహితులలో ఎవరోగానీ వాళ్ళదొకటే రామందాడి! ఎవడొచ్చినా వాడికి ముందుగా కాఫీ ఉపాయనం! ఇంత ఖర్చుకూ జమవుతున్నది ఆ నోరులేని జీవుడు గడిస్తున్న తొంభై రూపాయలు మాత్రమే! ఐతే లోటు బడ్జెట్టంతా చేబదుళ్ళ మూలంగానే పూరింపబడుతుందన్నమాట! ఏమిటో మరి, నా ప్రాపంచిక జ్ఞానం ప్రసరించినంతలో యిది నమ్మడానికి వీల్లేనిమాట.

ఆ రోజురాత్రి హోటల్లో భోజనంచేసి గదికివెళ్ళేసరికి గంట తొమ్మిదైంది. వసారాలో యింటి యజమాని మామూలుగా బుద్ధ విగ్రహానికి మల్లె కూర్చునేచోటు ఖాళీగా వుంది. ఈ పాటికి పెళ్ళిపడిన పాటుగా వుండవలసిందిపోయి, యింటి లోపలినుంచి గూడా అలికిడి వినరావడంలేదు. లక్ష్మి ఒక్కతె మాత్రం హాల్లో కూర్చుని చదువుకుంటోంది.

"అందరూ ఎక్కడికి వెళ్లారు లక్ష్మీ!" అన్నాను.

"కొత్త సినిమా వచ్చిందట మేష్టరుగారూ! అందరూ సినిమాకు వెళ్లారు. ఇంటి కొస్తున్నప్పుడు తోడుగా వుండడానికి నాన్నగారింతకు మునుపే దేరాదగ్గరకు వెళ్లారు" అంది లక్ష్మి.

"ఇంట్లో నిన్ను ఒంటరిగా దిగవిడిచి వాళ్ళకు దోవతోడు కోసం వెళ్ళారన్నమాట!" అంటూ కుర్చీలో కూర్చున్నాను.

"మనుషులుంటేనే నాకు భయం మేష్టరుగారూ! కంటికి మనుషులు కనిపించకపోతేనే నాకు హాయిగా వుంటుంది."

ఎండిపోయిన యిసుక పర్రలపైనించీ వీచే వడగాడ్పులాంటి ఆ వాక్యాల విసురుకు నేను వులికిపడ్డాను. "తోడి మానవులపట్ల ద్వేషాన్నీ అసహ్యాన్నీ మనసులో రగిలించుకోగూడదు లక్ష్మీ! మంచిదిగాదు" అని మందలించబోయాను.

"మీరలాగే అంటారు మేష్టరుగారూ! మీ కళ్ళకు లోకమంతా మంచిగానే కన్పిస్తుంది. ఈ మనుషులు పెడ్తున్న ఆరడికి నా హృదయం ఎలా మండిపోతున్నదో మీకు తెలియదు. తెలిస్తే మీరిలా మాట్లాడరు...."

లక్ష్మి కళ్ల విస్ఫులింగాలై పోతున్నాయి. ఆ అరుణారుణ నేత్రాలతో, నిశ్చలంగా నిలిచిపోయిన కనురెప్పలతో, రేగిన ముంగురులతో ఆమె తోకత్రొక్కిన నాగకన్యలా ద్యోతకమైంది.

"అదేమిటి లక్ష్మీ! ఎందుకాకోపం? ఎవరిమీద?" విస్మయంతో అడిగాను.

లక్ష్మి చరాలునలేచి నిల్చుంది. "చూడండి మేష్టరుగారూ! మీరర్థంచేసుకోగలరు. ఈ చీరచెంగు చూడండి. ఈ చేతులు చూడండి...." చీరచెంగు కకావికలుగా చిరిగిపోయివుంది. చేతులమీదుగా అర్ధచంద్రాకారంతో చిన్నగాయాలు కనిపిస్తున్నాయి. "తెలియడంలేదా మేష్టరుగారూ! మధ్యాహ్నం మూడుగంటలై వుంటుంది. ఇంట్లో ఎవ్వరూ లేరు. పడసాలలో కూర్చుని బియ్యం చెరుగుతున్నాను. వెనుకవైపు నుంచీ ఎవరో తాకినట్టయింది. తిరిగి చూచాను. మీరూ చూచేవుంటారు, నల్లగా పొడుగ్గా జుబ్బా తొడుక్కుని జీరంగిలా తిరుగుతుంటాడు- వాడి పేరు శంకరంగాడు! పశువుకైనా అంత బలముంటుందా మేష్టరుగారూ! అప్పటికీ నేను లేచిన వేళ మంచిది. ఇంతటితో వదిలి పెట్టేశాడు...."

ఫణమెత్తిన కొదమత్రాచులా లేచి నిల్చున్న లక్ష్మి, నిల్వలేక కుప్ప గూరలా క్రింద కూలిపోయింది. తలపైకెత్తి నావైపు చూడలేక చీర చెరగులో ముఖం దాచుకుని మోకాళ్ళపైకి వాలిపోయింది.

ఆ దురవస్థలో లక్ష్మిని చూడలేక నేను కళ్లు గట్టిగా మూసుకున్నాను. కానీ ఎంతోసేపు అలా వుండలేకపోయాను. కళ్ళు తెరిస్తే లక్ష్మి కనిపిస్తుంది. మూసుకుంటే ప్రేలుతున్న అగ్నిపర్వతాలు, కాలిపోతున్న ఉద్యానవనాలు, బడబాగ్నిలో వుడికిపోతున్న మహాసముద్రాలు కనిపిస్తున్నాయి!

ఆఖరుకు నన్ను నేను నిలవరించుకుని "వాడి కంతటి ధైర్యం ఎక్కడినుంచీ వచ్చింది లక్ష్మీ?" అన్నాను.

ఈ ప్రశ్నతో లక్ష్మి గుండెలో గూడుకట్టుకున్న శోకం కట్టలుత్రెంచు కుంటుందని నే ననుకోలేదు. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోతున్న లక్ష్మిని ఓదార్చడం సైతం నాచేతనయింది గాదు. సజల నేత్రాలతో నావైపు చూస్తూ, రుద్ధకంఠంతో చెప్పుకపోతోంది లక్ష్మి—"ఆ మాట గూడా నా నోటిమీదుగానే వినాలనుకుంటున్నారా మేష్టరుగారూ! ఈ కుటుంబం ఒక రాక్షసిలాంటిది. దీనికి ఆహారం డబ్బు. రోజు కయిదూ, పదీ, పది హేనూ ఎంతైనా చాలదు. ఈ శంకరంగాడు—వీడిలాంటివాడు వేరొకడు, మరొాడు, యింకొకడు-వీళ్ళందరూ డబ్బు లెందుకు వెదజల్లుతున్నారు? ఒక చేతితో కాసులు రాలుస్తూ మరొక చేతితో వీళ్లాశించేదేమిటి? ఈ యింట్లో ఆశించడానికి కేముంది? నే నున్నాను....అంటే నా శరీర మన్నమాట!"

కాలిన యినుప కడ్డీతో వాత తీసినట్టయి నేను త్రుళ్ళిపడ్డాను. సభ్యత, సంస్కారం తలవంచుకోవలసిన కొన్నికొన్ని ఘోర సత్యాల ఎదుట మనిషి కిలాంటి అనుభూతి కలగడంలో ఆశ్చర్యమేమీలేదు. కానీ నేను త్రుళ్ళిపడినందుకు మరొక కారణం గూడా లేకపోలేదు. ఆనాటి వుదయం అయిదు రూపాయల చేబదులుకోసం కుర్రాడు గదిలోకివచ్చిన సంఘటన నా మదిలో మెదిలింది. ఐతే నేనుగూడా మరొక శంకరంగాడి క్రింద జమ కట్టబడుతున్నా నన్నమాట! కొంపదీసి వాడికంటే కార్యశూరుణ్ణిగా గూడా కనిపిస్తున్నానేమో!

ఈ ఊహ నన్ను మూలమట్టంగా కదిలించి వేసింది. తటాలున పైకిలేచి నా గదిలోకి వెళ్ళిపోయాను. తలుపు వేసేశాను. దీపం ఆర్పేశాను. చుట్టూరా చీకటి. మానవుడు చనిపోయిన తర్వాత ప్రేత మౌతాడంటారు. అనగా మానవుడు బ్రతికివున్నంతవరకూ ఆ ప్రేతం వాడి అంతరాంతరాల్లో దాగివుంటుందన్నమాట! అలాటి ప్రేతాలు కొన్ని ఈరోజు బయటపడ్డాయి. గదిలోకివచ్చి తలుపు వేసుకున్నా విడవకుండా అవి నన్ను తరుముకొచ్చేశాయి. వికటంగా నవ్వుతూ నా చుట్టూ వికృత లాస్యం సలుపుతున్నాయి.

ఆ రాత్రంతా నాకలాగే గడిచి పోయింది. అంతూ, పొంతూ లేని ఆలోచనలన్నీ తెల్లవారకముందే ఈ గదిని ఖాళీచేసి మరెక్కడికైనా వెళ్ళిపోవాలన్న నిర్ణయంలో పర్యవసించాయి. గడియ గడియకూ ఈ నిర్ణయం దృఢతరమౌతూవచ్చింది. కానీ తెల్లవార బోతుండగా నా నిర్ణయం విచిత్రంగా మారిపోయింది. ఈ గదిలో మకాం పెట్టడంవల్ల నాకు కలిగే హానికంటే అక్కడినుంచీ బిచాణా సర్దుకోవడంవల్ల లక్ష్మికి కలిగే ఆశా భంగమే గొప్పది. తన జీవచైతన్యాన్నంతా ఆమె ఏ ఆశపైనయితే కేంద్రీకరించిందో ఆ ఆశను మొదలంట త్రుంచి పారిపోయినట్టయితే అందరితో బాటు నేను గూడా లక్ష్మి బ్రతుకుపైన చంద్రనిప్పులు పారజల్లిన వాడినే అవుతాను.

తెల్లవారింది. యథాప్రకారం ఆఫీసుకు వెళ్ళాను. సాయంత్రం తిరిగి వచ్చాను. ఆ రాత్రిగూడా లక్ష్మికి పాఠం చెప్పడానికి కూర్చున్నాను. కానీ మునుపటి ఉత్సాహంతో మాత్రం కాదు....

రెండు మాసాలపాటు యిలాగే జీవితం మిట్టెక్కుతున్న రోడ్డు రోలరులా పట్టబలవంతాన దొర్లిపోయింది.

కథలో పిట్టకథలా యిక్కడ నా వుద్యోగాన్ని గురించి కొంత చెప్పుకోవాలి. చేత నాలుగు కాసులు మిగిలిన ఓ పెద్ద మనిషి పత్రిక నడుపుదాం రమ్మన్నాడు. పిలుపందుకుని బస్తీకి వచ్చాను. ఇద్దరమూ ఓ చిన్న

గదిలో కూర్చుని గాలిమేడలు కట్టుకున్నాము. చేత పిండి లేకపోయినా నిప్పటి పెద్దదిగా చేయాలనుకున్నాము. చేసిన నిప్పటి రుచికరంగానే గాక ఆరోగ్యకరంగ్గా గూడా వుండాలనుకున్నాము. వచ్చిన చిక్కల్లా అక్కడే వచ్చింది. ఐదారు మాసాల్లో అంచనాలు తారుమారై మేము ఒకరి ముఖం ఒకరు చూచుకుని బిక్కరించవలసి వచ్చింది.

"అనుభవానికి మించిన గురువు లేదన్నారు తమ్ముడూ! డబ్బు ధార బోసుకున్నా మనం మంచి అనుభవాన్ని గడించుకో గలిగాము. ఈ నెల పత్రిక ఎలాగూ ప్రెస్‌కు వెళ్ళిపోయింది. దీన్ని విడుదలచేసి యింతటితో సెలవు తీసుకుందాము" అన్నా డాయన.

ప్రెస్సునుంచీ ప్రొద్దుపోయిన తర్వాత గదికి తిరిగివస్తున్నాను. మార్గ మధ్యంలో ఎవరో భుజంపైన చేయివేశారు.

"ఏమిటోయ్ గిరీ! ఆకాశానికి మూడే బారలన్నట్టుందే నీ పని!"

అతడు శంకరం! ఒకే పడవలో పయనంచేస్తున్న తోడి ప్రయాణీ కుడిలా పలకరిస్తున్నాడు! రోడ్డుపైకి దొర్లించి పిడిగ్రుద్దులతో వాడి ఎము కల్ని నుగ్గునూచం చేయాలనిపించింది. కానీ పోట్లాట అంత తేలికైన పనిగ్గాదు. అందుకు ధైర్యం కావాలి. ఆ ధైర్యం పుట్టుకతో రావాలి.

అతడు చూచిన చూపులో, నవ్విన నవ్వులో ఏదో నిగూఢ భావం పొడగట్టింది. భావం గూఢమైనా ఫలితం తేటతెల్లమే! పెడదారి వెంట ప్రసరించే బుద్ధికి ఏ చాప క్రిందికి నీళ్ళు తెద్దామా అన్న ఆలోచన తప్పితే మరొక ధ్యాసేముంటుంది?

చివరి సంచికను పోస్టుచేసి పోస్టాఫీసునుంచీ బయటికి వచ్చాను. పోస్టుమేన్ నా చేతికొక ఉత్తరాన్ని అందించాడు.

"శ్రీవారికి నమస్కారాలతో పార్వతి వ్రాయునది...."

పార్వతే! జాబు వ్రాయడమే! కాదు కాదు- ఇది శ్రీమతి తన పేరు మీదుగా తమ్ముడిచేత వ్రాయించిన ఉత్తరం. విషయ సారాంశం మాత్రం అర్థాంగిది. ఆవిష్కరణ బావమరిదిది!

"క్షేమం. దేవుని దయవలన మీ క్షేమములు గూడా తెలిసినవి. మీరు నెలనెలా పంపుతున్న రొక్కరోజనాలు మన యిళ్ళకూ వాకిళ్ళకూ పట్టడం లేదు. నాకూ చిరంజీవులకూ అష్టయిశ్వర్యాలతో తులతూగడం తప్పా మరొక పనిలేదు. ఈ ఆనందంతోబాటు మీరు పట్టణంలో వెలిగిస్తున్న రాచకార్య మేమిటో తెలిసి మహదానందం కలిగింది. (ఎలా తెలిసిందో సముఖాన విన్నవించుకుంటాను.) మీరు కథలు వ్రాయగలరనుకోడమేగానీ స్వయంగా రసవత్తరమైన కథల్ని నడిపించగలరనీ నేనెన్నడూ అనుకోలేదు....ఈ పల్లెటూరి బ్రతుకంటే నాకు గూడా తగని చిరాకు కలుగుతోంది. చిన్న కాపురానికి తగ్గట్టుగా ఓ యిల్లు చూచి వుంచండి. నాలుగైదు రోజుల్లో బయల్దేరి వస్తున్నాము...."

జాబును జేబులో వుంచుకుని ఓపినంతవరకూ వీధుల వెంట తిరిగాను. మధ్యమధ్యలో జేబులోని జాబునుతీసి మళ్ళీ మళ్ళీ చదువుకున్నాను. పార్వతి మంచిదే. కానీ ఆమెకు చేరవేయబడిన వార్త చెడ్డది. పట్టణంలో నాకు యెక్కడపడితే అక్కడ డబ్బు దొరుకుతుందని ఆమె నమ్మకం. డబ్బు దొరికినకొద్దీ మనిషి చెడిపోవచ్చునని ఆమె విశ్వాసం. ఈ ఆరుమాసాలుగా నేను యింటికి వెళ్ళకపోవడం, క్రమంగా జాబులు వ్రాయకపోవడం యిదంతా ఆమెకు సంపదమరుపుగా భాసిస్తుంటుంది! పిచ్చి పార్వతి. అసలే అదొక ఉద్వేగప్రకృతి! ఇంకా ఒకటి రెండు రోజులు ఆలస్యంచేస్తే ఆవిడ యింతదూరంవచ్చి నాపైన విరుచుకపడినా పడవచ్చు.

గంట తొమ్మిదైంది. కాళ్ళు గాలిలో తేలిపోతున్నాయి. కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. కాయాన్ని యిక బసకు చేరవేయడంకన్నా గత్యంతరం కనిపించడం లేదు.........తీరా వెళ్ళేసరికి లక్ష్మి నాకోసం ఎదురుచూస్తోంది. ఆమె ఎట్టఎదట ప్రశ్నార్థకపు గుర్తులతో నిండిన లెక్కల పుస్తకం!

"మేష్టరుగారూ! ఈ లెక్క మళ్ళీ మరచిపోయాను. ఈసారి చెప్పండి బాబు" అంది లక్ష్మి.

నాకు తెలుసు- ఈసారి మాత్రమేగాదు, యింక వెయ్యిసార్లు చెప్పినా

లక్ష్మికి ఆ లెక్కరాదు. 'రాని లెక్కకోసం శ్రమపడుతున్న లక్ష్మీ! నువ్వెదురు చూస్తున్నది గూడా రాబోని సౌఖ్యమే!' అని చెప్పి రివ్వున వెనుదిరిగి వెళ్ళిపోవాలనుకున్నాను. కానీ మానవుడు పరిస్థితుల చేతి కీలుబొమ్మ. అతడు చెప్పదలచిందంతా చెప్పలేడు—చేయదలచిందంతా చేయలేడు.

లక్ష్మి యింకా చదువుతుండగానే గదిలోకి వచ్చేశాను. రాత్రి మలి జాముగూడా గడచిపోయింది. కాసేపు గోడకు చేరగిలబడి కూర్చున్నాను. లేచి నిల్చున్నాను. గదిలో పచార్లు చేశాను. నిద్రపట్టని రాత్రి ఎంతగా వేధించ గలదన్నది నా అనుభవానికి బాహ్యమైన విషయంకాదు. కానీ ఒకవిధంగా నే నదృష్టవంతుణ్ణి! కొండంత బరువుతో హృదయం చిద్రుపలు చిద్రుపలుగా ప్రిదిలిపోతున్నపుడు ఆ బాధనుంచీ విముక్తి పొందడానికి భగవంతుడు నాకొక వరం ప్రసాదించి వున్నాడు........

కాగితమూ కలమూ చేతికి తీసుకుని లక్ష్మి కథకు శ్రీకారం చుట్టాను. ఎప్పుడు వేగుచుక్క పొడిచిందో తెలియదు, ఎప్పుడు అరుణోదయమైందో తెలియదు. కూర్చునే కిటికీ తెరిచాను. సూదుల్లావచ్చి సూర్యకిరణాలు గుచ్చుకున్నాయి.

ఎంత వ్రాసినా మరి కొంత వ్రాయాలనేవుంది. పది పదిహేను నిమిషాల్లో నేనిక్కడినుంచీ వెళ్ళిపోతున్నాను. తలుపు మూసి, చిలుకువేసి మామూలు మేరకు విరిగిన తాళం తగిలించి, మరెన్నటికీ లక్ష్మికి కనిపించకుండా మాయమై పోబోతున్నాను. తీరిక దొరకగానే దీపం దగ్గర కూర్చుని పుస్తకం తెరచుకుని లక్ష్మి నా కోసం ఎదురుచూస్తుంది. ఎంతసేపటికీ నేను కనిపించను. ఏమనుకుంటుంది లక్ష్మి? నా కోసం ఎవరిని అడుగుతుంది? ఏమని అడుగుతుంది? ఎలా చదువగలుగుతుంది? చివరికేమైపోతుంది?

ఇది నన్ను జీవితాంతం వెన్నాడే ప్రశ్న. లక్ష్మి చివరి కేమై పోతుంది? ఆమె జీవితం ఎలా పరిణమిస్తుంది? ఏమౌతుంది లక్ష్మి?

★ ★ ★

భానుమూర్తి కూర్చున్న గదిలో వుక్కపోస్తోంది. అతడు ధరించిన వుడుపుల క్రింద చెమట చిరచిర లాడుతోంది. గాలి కదలని గదిలోని వాతావరణంలోలాగే కథ చదివి ముగించిన భానుమూర్తి మనసులో గూడా వూపిరాడడంలేదు. అతడు గభాలునలేచి బయటకు వచ్చాడు. శీతల పవనం చల్లగా కణతలకు సోకడంతో అతడి ఆలోచనలు లాకులు త్రెంచుకుని ముందుకు దూకాయి.—ఇది శేషగిరి వ్రాసిన కథ. కేవలం కథగాదు, ఒక దుఃఖజీవి దుర్భర జీవితం అన్నాడు శేషగిరి. జీవితం విచిత్రమైందిలా వుంది. ఒక్కొక్కప్పుడు కల్పనాకథ కంటే విపరీతమైందిలా వుంది గూడ! ఉన్నదున్నట్టు వాస్తవాన్ని చిత్రించాలనుకుంటాడు కథకుడు. ఆ వాస్తవం చాలా నిరాశాజనకంగా వుంది. వర్తమానాన్నిబట్టి అనాగతాన్ని గురించి ఆలోచించినప్పుడు ఆ వూహ మరీ గుండెల్ని జలదరింప చేసేదిగా వుంటుందేమో! నైతిక పతనానికి దారితీసే వ్యతిరేక పరిస్థితులతో ఎంతకాలమని సంఘర్షించడానికి వీలుంటుంది? ఆత్మవిశ్వాసం సడలిపోగా, ఆత్మనిగ్రహం నశించిపోగా తోడివారిపట్ల ఎదలో ఏహ్యభావాన్ని పెంపొందించుకుని, శారీరికావసరాలకంటే సాధించవలసినది మరేదీ లేదనీ, అందుకోసం నిస్సంకోచంగా ఎలాటి అవినీతికైనా పాల్పడి చివరకు మానవత్వం పశువృత్తిగా దిగజారి పోవడంకన్నా దారుణోదంతం లోక చరిత్రలో మరేముంటుంది! ........

భానుమూర్తి వసారాలో ఈ చివరినుంచీ ఆ చివరిదాకా నడిచాడు. వెన్నెల వెలుగులో వెలవెలబోతున్న వీథి దీపాన్ని చూస్తూ ద్వారబంధానికి ఆనుకుని నిల్చున్నాడు.

నాలుగైదు నిమిషాలు అలాగే గడిచిపోయాయి. ఆలోచనల అల జడిలోనుంచీ ఒక్కింత తేరుకుని భానుమూర్తి ముందుకు కదలబోయాడు. వెనుకనుంచీ ఎవరో లాగినట్టయింది. తిరిగి చూచాడు. కండువా కొంగు చిలుకులో తగులుకుంది.

కండువాను లాక్కోబోయాడు భానుమూర్తి. దానితోబాటు చిలుకులో నుంచీ తాళం చెవిగూడా వూడి జారి క్రింద పడిపోయింది.

భానుమూర్తి బుర్రలో మెరుపులాంటి ఓ వూహ రివ్వున ప్రాకింది. విరిగిన తాళాన్ని గురించిన ప్రస్తావన రావడానికి యిది మూడోసారి. మొదటి రెండుసార్లూ ఆ ప్రస్తావన కథలో వచ్చింది. భానుమూర్తి మనసులో ఇంకా ఆ కథ, కథలోని పాత్రలూ పారాడుతున్నాయి. మెరపులాంటి ఆ వూహ మబ్బులాంటి ఈ కథలో వెయ్యి వలయాలు తిరగడంతో జ్యోతిర్మయమై పోయిన మానసాంబరంలో కథలోని పాత్రలన్నీ సజీవ మానవరూపాలతో సాక్షాత్కరించాయి. ఆ దిగ్భ్రమలో భానుమూర్తి అప్రయత్నంగా చిలుకు తీసి తలుపు తెరిచేశాడు. గది లోపలికి వెళ్తూ ద్వారం దగ్గరవున్న స్విచ్ వేసేశాడు. వెలిగిన విద్యుద్దీపం క్రింద ఆ గది దాదాపు చెత్త కాగితాల బుట్టలా వుంది. చేతికి దొరికిన కాగితాన్ని పైకి తీశాడు భానుమూర్తి. సందేహంలేదు, అది శేషగిరి దస్తూరీ!

భానుమూర్తి కళ్ళు మూసుకున్నాడు. మండని పొయ్యిలో నుంచీ మెండుగా పైకి లేస్తున్న పొగకేసి చూస్తూ, రూపుగట్టిన శోకంలా బొబ్బ లెగిరిన చేతిని విసనకర్రతో విసురుకుంటూ కూర్చున్న అమ్మాయి దీన వదనం అతడి మనోనేత్రాలకు ప్రత్యక్షమయింది.

"అయ్యో లక్ష్మీ!" నిట్టూర్చాడు భానుమూర్తి.

"మేష్టరుగారూ!"

భానుమూర్తి వులిక్కిపడ్డాడు. ద్వారానికటువైపున లక్ష్మి!

పిలుస్తూ వచ్చింది లక్ష్మి. వచ్చి నిల్చోగానే భానుమూర్తి కనిపించాడు. కనుపించగానే లక్ష్మి ఓ అడుగు వెనక్కు వేసింది. వేస్తూ తొట్రుపాటుతో ప్రశ్నించింది—"మేష్టరుగారు లేరూ?"

భానుమూర్తి ఏదో చెప్పబోయాడు. కానీ చెప్పలేక పోయాడు. మాట్లాడ్డానికి వీల్లేకుండా అతడి గుండె గొంతుకలో కొట్లాడుతోంది.

లక్ష్మి ఒకటి రెండు క్షణాలు మాత్రమే అక్కడ నిల్చింది. ఆ తరువాత గిరుక్కున వెనుదిరిగింది.... లక్ష్మి వెళ్ళిపోతోంది.

"లక్ష్మీ!"

ఆ పిలుపులో భానుమూర్తి హృదయం నినదించింది.

ఆ పిలుపు లక్ష్మి కాళ్ళకు బంధాలు వేసింది.

"నీతో ఒకమాట చెప్పాలి లక్ష్మీ! ఒకేమాట"—అర్థిస్తున్నాడు భానుమూర్తి.

"నాతోనా!" లక్ష్మికి దిక్కులు తోచడం లేదు.

"అవును. నీతోనే!"

ఆమె మంత్రముగ్ధలా మళ్ళీ ద్వారం దగ్గరకు వెళ్ళి నిల్చింది.

"ఏం చెప్పాలో తోచడంలేదు లక్ష్మీ! ఎలా ప్రారంభించాలో అంతకన్నా తెలియడంలేదు. శేషగిరి మూలంగా నీ దుఃఖ గాథ నాకు తెలిసింది. అతనితో నేను ఈ కథను పూర్తిచేయగలనని చెప్పాను. హాస్యాన్నికన్న మాటయినా అందులో భగవంతుడు పరమార్థాన్ని నిక్షేపించాడు. నాకు తల్లి దండ్రుల్లేరు. అన్నదమ్ముళ్ళు లేరు. అక్కచెల్లెళ్ళు లేరు. నా జీవితంలో చాలా భాగం వెలితిగా వుండిపోయింది. ఆ వెలితినంతా పూరించగల అర్థాంగి కావాలి నాకు."

లక్ష్మి తెల్లబోయింది. "మీరేం చెబుతున్నదీ నాకు తెలియడంలేదు. నేను మీ రనుకుంటున్నదాన్నిగాను. నేను లక్ష్మిని! చిన్నప్పుడే పసుపు కుంకుమలు గోల్పోయిన నిర్భాగ్యురాల్ని."

"కావచ్చు లక్ష్మీ! మొదలంట నరికివేసిన చెట్టు గూడా మళ్ళీ చిగురించడానికి సమ్మతించే భగవంతుడు నీ నుదుట నిరంతర వైధవ్య దుఃఖాన్ని వ్రాసిపెట్టి వుంటాడని నేననుకోను. నిన్ను చేబట్టాలనుకుంటున్నది, పెద్ద త్యాగం చేశానన్న గర్వంతో ఉప్పొంగి పోవడానికి గాదు. మనం దైవికంగా యిలా కలుసుకోగలిగాము. నువ్వు నా కళ్ళకు పవిత్ర దీప శిఖలా కనిపిస్తున్నావు. ఇక్కడ దీపాన్ని ఆర్పేసే ప్రయత్నాలు

జరుగుతున్నాయి. అక్కడ దీపంలేని నా యిల్లు చీకటిలో బిక్కు బిక్కుమంటూ గృహలక్ష్మి కోసం ఎదురు చూస్తోంది. దీపం లేని నా యింటికి దీపానివికమ్మని నిన్ను అర్థిస్తున్నాను....''

"మీ మాటలు వింటుంటే నాకు భయంగా వుంది. దయచేసి నన్ను వెళ్ళిపోనివ్వండి. మీరు ప్రభావతిని చూడ్డంకోసం వచ్చారు. మీ మాటల్ని మా వాళ్లు గనుక వింటే....''

చూపులతోనే వారించి భానుమూర్తి లక్ష్మికి అడ్డు తగిలాడు. "మీ వాళ్ళతో నాకు ప్రసక్తిలేదు లక్ష్మీ! ఆ ప్రసక్తిని తెచ్చి మన ప్రసంగాన్ని కలుషితం చేయవద్దు. పావురం వలలో నుంచీ బయటపడడం ఏ పరిస్థితి లోనూ వేటగాడికి సంబరంగా వుండబోదు. బస్తీనుంచి వెళ్ళిపోక తప్ప దన్న నిర్ణయానికి వచ్చిన తర్వాత రాత్రంతా మేలుకుని శేషగిరి నీ కథ వ్రాశాడు. వ్రాసి ముగిస్తూ 'లక్ష్మి నాకోసం ఎవరిని అడుగుతుం'దని వాపోయాడు. నువ్వు మేష్టరుగారెక్కడ అని నన్ను ప్రశ్నిస్తున్నావు. ఈ లంకెకూడా దైవికంగానే వుంది. నేను నీకు క్రొత్తవాణ్ణి. ఐనా నువ్వు నన్ను దానవుణ్ణని మాత్రం భావించకపోతే చాలు. నువ్వు నన్ను నమ్మాలే గానీ, నమ్మలేకపోతే బాసలు పలికి నిన్ను నమ్మించడం గూడా నాచేతగాదు. ఏమంటావు లక్ష్మీ?"

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి. ఆ రెండు నిమిషాల్లో మొదట లక్ష్మి కనుగొలకుల్లో కన్నీటి ముత్యాలు నిలిచాయి. ఆ తరువాత కన్నీటిధారలు కపోలాల వెంట చారికలు కట్టాయి. పెదవులు గులాబీరేకుల్లా చలించాయి. శోకం గొంతుకను పెగల్చుకుని బయటపడింది. వెక్కి వెక్కి ఏడుస్తూ లక్ష్మి గోడపైకి ఒరిగి పోయింది.

"తప్పుకాదూ! ఏడుస్తావెందుకు లక్ష్మీ!"

''నాకదంతా ఓ కలలా వుంది. కలే అయినప్పటికీ యిది కరిగి పోకుంటే చాలు!''

పైగుడ్డతో లక్ష్మి కన్నీటిని తుడుస్తూ అన్నాడు భానుమూర్తి—
"ఇది కలెందుకౌతుంది లక్ష్మీ! నిజం. నీ హృదయంలోని మార్దవానికి మల్లే, నీ మనసులోని నైర్మల్యానికి మల్లే, నీ కళ్ళల్లోని అమాయకత్వానికి మల్లే, అక్షరాలా నిజం!"

★ ★ ★

"నీకొక వుద్యోగం చూచాను. తక్షణం బయల్దేరి రావలసింది—" వచ్చింది జాబుగాదు; టెలిగ్రాము. చూడగానే బయల్దేరాడు శేషగిరి. భానుమూర్తి స్టేషను దగ్గిరకే ఎదుర్కోలు వచ్చాడు.

మిత్రులిద్దరూ చేతులు గలుపుకుని నడవసాగారు. దోవ పొడుగునా భానుమూర్తి రాజకీయాలనుగురించి, యిటీవల పత్రికల్లో వెలువడిన మంచి కథలను గురించి చెప్పుకుపోతున్నాడు. పల్లెటూరినుంచీ వచ్చిన శేషగిరికి ప్రతి వార్తా క్రొత్తదిగానే వుంది. కానీ మనసంతా తనకోసం భానుమూర్తి చూచిన వుద్యోగంపైన్నే లగ్నమై వుండడంచేత అతడు నిద్రలాంటి పరధ్యానంలో మునిగిపోయి, తెప్పరిల్లినప్పుడల్లా "ఓహో! అలాగా! అవును మరి" అన్న పాత పదాలను దొర్లిస్తూ మిత్రుడివెంట నడుస్తున్నాడు.

"ఇదేనోయ్ శేషగిరీ నా కుటీరం!" అన్నాడు భానుమూర్తి శేషగిరిని ఒకచోట ఆపి.

అది కుటీరంగాదు, భవనమే! శేషగిరి నవ్వుతూ "యింకా నయం! ఆశ్రమమనో, మఠమనో అన్నావుగావు" అన్నాడు.

"ఎంత చక్కగా ఊహించావు శేషగిరీ. పూర్వాశ్రమంలో యిది మఠమే! ఆ మఠంలో యీ బైరాగి ఈగలు తోలుకుంటూ కాలం గడిపేవాడు!...."

"ఐతే ప్రస్తుతం ఈ బైరాగి చేస్తున్న పనేమిట్రా భానూ, కుండల్లో గుర్రాలు తోలడం కాదుగదా!" పకపక నవ్వుతూ శేషగిరి యింట్లో ప్రవేశించాడు.

"రాక రాక వచ్చావు కూర్చో శేషగిరీ! నిన్నెలా సత్కరించడమో తోచడంలేదు. చాయిస్ నీకె వదిలివేస్తున్నాను. ఏం కావాలో చెప్పుకో! షర్బత్తా, కాఫీయా, టీయా, ఓవల్టిన్నా?"

"ఓ గ్లాసులో చల్లగా మంచినీళ్ళు" అంటూ శేషగిరి కుర్చీలో కూర్చున్నాడు.

భానుమూర్తి లోపలికి వెళ్ళగానే శేషగిరి టేబిలుపైనించీ ఓ పత్రిక తీశాడు. వరుసగా బొమ్మల్ని మాత్రం చూచాడు. పత్రికను యథాస్థానంలో వుంచి మరో పుస్తకం చేతికి తీసుకుని అక్కడక్కడా నాలుగు పద్యాలు చదివాడు. అప్పటికే అయిదారు నిమిషాలు గడచిపోయాయి శేషగిరి విస్తుపోయాడు. మంచినీళ్ళకోసం భానుమూర్తి క్రొత్తగా ఓ చేద బావి త్రవ్వడం లేదుగదా!

అడుగుల సవ్వడి వినిపించింది. శేషగిరి తల పైకెత్తాడు.

ఎట్టఎదుట పట్టుచీరలో లక్ష్మి!

నుదుట కుంకుమ. జడలో మల్లెపువ్వులు. మెడలో వన్నెమాయని పసుపుదారం.

లక్ష్మి చేతుల్లో పళ్ళెరం. పళ్ళెరం నిండుకూ పువ్వులు. పువ్వుల పైన తన చివరి కథ. అన్నింటికీపైన ఓ చిన్ని కానుక—ఊదారంగు వూట కలం.

పళ్ళెరాన్ని శేషగిరి పాదాల ముందు వుంచింది లక్ష్మి. మోకరిల్లి "అంతా మీ దయ మేష్టరు గారూ! దీవించండి" అంది.

శేషగిరికి ఒక నిమిషంపాటు అనిమిషత్వం సిద్ధించింది. విప్పారిన అతడి కళ్ళ ఎదుట భానుమూర్తి గృహలక్ష్మి. ఆనంద వివశత్వంతో కనురెప్పలు బరువెక్కి క్రిందికి వాలిపోయాయి. పండు వెన్నెల తళతళలలో పరవశమై దిశాంచలాలవరకూ అలలు అలలుగా కదిలిపోతున్న పాల మున్నీరు అతడి హృదయంలో వుయ్యాల లూగుతోంది!

*